AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

27-8-2026 (Thursday)

MAIN EDITION

## రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థుల మృతి



**అక్షరటుడే, రంగారెడ్డి :** ఇబ్రహీంపట్నంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు. గురునానక్ కాలేజీకి చెందిన నలుగురు బీటెక్ ఫస్టియర్ విద్యార్థులు బుధవారం రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ టాటా ఏసీ వాహనం వేగంగా వచ్చి వారిని ఢీకొంది. ఈ ఘటనలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వరంగల్‌కు చెందిన శివరాజ్ చికిత్స పొందుతూ చనిపోయాడు.

## యువ క్రీడాకారులకు ప్రధాని మోదీ దిశానిర్దేశం




**అక్షరటుడే, న్యూఢిల్లీ :** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా "ఖేల్ కీ బాత్.. పీఎం కే సాత్" కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న యువత, అథ్లెట్లతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. 'ఖేలో ఇండియా సంవాద్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న 1,500కు పైగా కాలేజీల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడలు, ఫిట్‌నెస్ ప్రాముఖ్యతతో పాటు దేశాభివృద్ధిలో యువత పాత్ర గురించి ప్రధాని దిశానిర్దేశం చేశారు.

### చక్కెర కొనుగోళ్లపై పరిమిత ఆంక్షలు!



అక్షరటుడే, ఢిల్లీ : దేశంలో చక్కెర ధరలు భారీగా పెరిగాయి. దీంతో కొనుగోళ్లపై ఆంక్షలు అమలు అవుతున్నాయి. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి యాప్‌లు ఒక్కో ఆర్డర్‌కు కేవలం రెండు కేజీల ప్యాకెట్లకు మాత్రమే అనుమతిస్తున్నాయి. కొన్ని చోట్ల కొన్ని బ్రాండ్లు అందుబాటులో లేక "స్టాక్ లేదు" అని చూపిస్తున్నాయి.

### కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ ఆహ్వానం



అక్షరటుడే, హైదరాబాద్: కేటీఆర్‌కు హర్యానాలోని 'ఓ.పి. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ' నుంచి ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించడంతో పాటు, ప్రత్యేక ఉపన్యాసం ఇవ్వాల్సిందిగా కోరుతూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సి. రాజ్ కుమార్ కేటీఆర్‌కు లేఖ రాశారు.

### కాన్పూర్‌లో విమాన ప్రమాదం



అక్షరటుడే, యూపీ: కాన్పూర్ సమీపంలోని గంగా నది బ్యారేజీ పరిసరాల్లో గల ఓ వ్యవసాయ పొలంలో ప్రైవేట్ శిక్షణ విమానం కుప్పకూలింది. 'గార్గ్ ఏవియేషన్' అనే కాన్పూర్‌కు చెందిన శిక్షణ సంస్థకు చెందిన ఈ ట్రైనీ విమానంలో ప్రయాణిస్తున్న పైలట్, కో-పైలట్ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు.

# బీఆర్ఎస్‌ను దక్కించుకునే కుట్ర



- కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్‌రావు యత్నం
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత
- సీఎం ఆంధ్ర ఏజెంట్‌గా మారారని విమర్శలు

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్‌రావు కుట్ర పన్నారని ఆరోపించారు. మెదక్ ఎమ్మెల్యేలతో ఆయన ఇటీవల మీటింగ్ పెట్టారని చెప్పారు. కేటీఆర్‌కు వారసత్వం లేదని, బీఆర్ఎస్ పార్టీ తనకే వస్తదని ఆయన చెప్పారని ఆరోపించారు. మెదక్‌లో అన్ని సీట్లు గెలుచుకొని, బీజేపీతో అగ్రిమెంట్ చేసుకుందామని ఆయన ఎమ్మెల్యేలతో అన్నారని కవిత వ్యాఖ్యానించారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

మెదక్ నుంచి బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్ర చేస్తున్నారని, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడవాలని చూస్తున్నారని కవిత ఆరోపించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. హరీశ్‌రావు ఆర్ఎస్ఎస్ పెద్ద మనిషితో పలుమార్లు సమావేశం అయ్యారన్నారు. బీజేపీతో లాలూచీ చేసుకున్నారని, మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డితో సైతం ఆయనకు ఒప్పందం ఉందని ఆరోపించారు. హరీశ్‌రావు తిన్నింటి వాసాలు లెక్క పెట్టే వ్యక్తి అని విమర్శించారు. అలాంటి వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

### ఆంధ్ర రేవంత్‌రెడ్డి

కవిత సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. అనుముల రేవంత్‌రెడ్డి కాదని, ఆయన ఆంధ్ర రేవంత్ రెడ్డి అని కవిత అన్నారు. బ్రాహ్మణ పరిషత్ కార్పొరేషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ప్రభుత్వం ఆంధ్రకు చెందిన వారిని నియమించారన్నారు. మన తెలంగాణలో ఎంతో మంది పండితులు ఉండగా.. ఆంధ్రకు చెందిన వారికి ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రశ్నించారు. ఆంధ్ర ఎంపీ కొడుకు ర్యాష్ డ్రైవింగ్‌తో ఒక యువతి ప్రాణాలు తీస్తే పోలీసులు అతడికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. గతంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు బారికేడ్లను ఢీకొడితే హంగామా చేసిన ప్రభుత్వం.. ప్రస్తుతం ఎంపీ కుమారుడు యువతి ప్రాణాలు తీస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

### ఆంధ్ర పెత్తనం

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆంధ్ర అధికారుల పెత్తనం నడుస్తోందని కవిత విమర్శించారు. సీఎంవో కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏపీకి చెందిన వారు అన్నారు. ఇరిగేషన్ శాఖలో చాలా మంది ఆంధ్ర అధికారులు ఉన్నారని చెప్పారు. యాదగిరి గుట్ట బోర్డులో ఆంధ్రకు చెందిన నటుడి భార్యను ఎలా మెంబర్‌గా నియమించారని ప్రశ్నించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో తెలంగాణ నర్సులకు తక్కువ వేతనం, కేరళ నర్సులకు ఎక్కువ జీతాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఆంధ్ర ఏజెంట్‌గా మారారని విమర్శించారు.

### క్విడ్ ప్రోకో కేసు పెట్టాలి

ఒడిశా యువతి చనిపోతే బీఆర్ఎస్ సైతం మాట్లాడలేదని కవిత అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఏం లాలూచీ ఉందని ప్రశ్నించారు. నారాయణ, చైతన్య కాలేజీలపై బీఆర్ఎస్ పార్టీ ఒక్క మాట మాట్లాడదన్నారు. హరీశ్‌రావు ఆ కాలేజీలకు పాలు అమ్ముకుంటారని, అందుకే మాట్లాడరని పేర్కొన్నారు. గుంట నక్కకు, గుంపు మేస్త్రీకి లండన్‌లో లాలూచీ జరిగిందని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నగరంలోని అనేక ఆస్పత్రులకు, కాలేజీలకు ఆయన కంపెనీ ద్వారా పాలు సరఫరా చేశారన్నారు. దీనిపై క్విడ్ ప్రోకో కేసు పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. హరీశ్‌రావుతో సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేకపోతే వెంటనే పాలు సరఫరా చేసే ఒప్పందాన్ని రద్దు చేసి, విజయ డెయిరీ పాలు సరఫరా చేసేలా జీవో విడుదల చేయాలన్నారు.

### బీఆర్ఎస్ అవినీతి

బీఆర్ఎస్ హయాంలో వ్యవస్థీకృతమైన అవినీతి చేశారన్నారు. పాల పేరిట హరీశ్‌రావు, మున్సిపల్ అనుమతులు, రియల్ ఎస్టేట్ పేరిట కేటీఆర్, ఇసుక వ్యాపారంతో మరొకరు అవినీతి చేశారన్నారు. అవినీతి పార్టీ అయిన బీఆర్ఎస్‌కు కాకుండా కొత్త పార్టీ అయిన తమక అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు.

## మీర్ ఆలం ట్యాంక్‌ను పరిశీలించిన సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** పాతబస్తీలోని మీర్ ఆలం చెరువు పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. చెరువు వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం ఉదయం ఆయన ఆకస్మికంగా పరశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చెరువు వద్ద 'కేబుల్ స్టేడ్ బ్రిడ్జి' నిర్మిస్తున్నారు. ఈ పనులను సీఎం పరిశీలించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మీర్ ఆలం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మురుగునీరు చెరువులోకి చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## నేపాల్ వరదలకు భూకంపం కారణం కాదు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలు వరద, బురదమయమయ్యాయి. ఈ విపత్తుకు మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు రాగా, తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే అసలు నిజం బయటపెట్టింది. అది భూకంపం కాదని స్పష్టం చేసింది. హిమనీ సరస్సు బద్ధలవడం వల్ల భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయని వెల్లడించింది. దీంతో లిండే నది ఉప్పొంగి, బోటే కోషి నదిలోకి ఒక్కసారిగా వరద దూసుకొచ్చిందని శాటిలైట్ దృశ్యాల ద్వారా తేల్చారు.

## భూగర్భ గనుల శాఖ ఏడీ ఇళ్లలో ఏసీబీ దాడులు



**అక్షరటుడే, భూపాలపల్లి :** భూపాలపల్లి భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ సోదాలు చేపట్టింది. భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. దీంతో వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో సూర్యాపేట, తాండూరు సహా 12 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. భూపాలపల్లి, హైదరాబాద్ బోడుప్పల్‌లోని ఆయన నివాసాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. తనిఖీల్లో జయరాజుకు సంబంధించిన కీలక పత్రాలు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## నేపాల్ వరదపై రూమ్ ఏర్పాటు



**అక్షరటుడే, హైదరాబాద్ :** నేపాల్‌లో ఆకస్మిక వరదల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రభుత్వ సాధారణ పరిపాలన (ఎన్ఆర్ఐ) శాఖ హైదరాబాద్‌లోని సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. నేపాల్‌లోని వరదల వల్ల ప్రభావితమైన తెలంగాణకు చెందిన వ్యక్తుల కుటుంబాలకు అవసరమైన సమాచారం, సహాయం అందించడం, సమన్వయం కోసం దీనిని ఏర్పాటు చేశారు. సమాచారం లేదా సహాయం కోసం ఎస్. లక్ష్మీనారాయణ 9885371189, కె. శ్రీనివాస్ రెడ్డి 7997959754, చిట్టిబాబు 9440854433 ను సంప్రదించాలని సూచించింది.




## 22ఏ నుంచి వ్యవసాయ భూములు తొలగించాలి

**అక్షరటుడే, హైదరాబాద్ :** రైతు భూములు కూడా 22A నిషేధిత జాబితాలో పెట్టారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం రామదాస్‌పల్లిలో 300 ఎకరాలకు పైగా రైతుల పట్టా భూములను 22Aలో చేర్చి, రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. వ్యవసాయ భూములతో పాటు, ఇతర మూడు లే అవుట్లలోని భూములు కూడా 22A నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులకు రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు రావడం లేదని హరీశ్‌రావు అన్నారు. వెంటనే రైతుల భూములను 22A నుంచి తొలగించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నేటి నుంచి తగ్గనున్న వర్షాలు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** అల్ప పీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అయితే నేటి నుంచి వర్షాలు తగ్గుముఖం పడుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారం వరకు రాష్ట్రంలో వర్షాలు తక్కువగా కురుస్తాయి. ఉత్తర, తూర్పు తెలంగాణాల్లో మినహా, మిగిలిన తెలంగాణలో చిరుజల్లులు కురుస్తాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. రాబోయే 10 రోజుల్లో తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరిగి, వేడి, తేమతో కూడిన వాతావరణం నెలకొంటుంది.





## ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు.. ఏడుగురి మృతి

**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అతివేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ఇంటర్‌సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొంది. ప్రమాద సమయంలో ఆటోలో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు చికిత్స కోసం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## స్వీట్ షాపుపై పోలీసుల దాడి

**అక్షరటుడే, మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వీట్ హౌస్‌పై ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. బాలాజీ స్వీట్ హౌస్‌లో సింథటిక్ కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించి, కేసు నమోదు చేశారు. స్వీట్లు, ఇతర ఆహార ఉత్పత్తుల తయారీలో గడువు ముగిసిన ఆహార పదార్థాలను వాడుతున్నట్లు గుర్తించారు. దీంతో షాప్ నిర్వాహకుడు రాజస్థాన్‌కు చెందిన కమల్ కుడ్మడియా (37)ను అదుపులోకి తీసుకున్నారు. 30 కిలోల కలఖండ్, 500 గ్రాముల డ్రైఫ్రూట్ స్వీట్లు, 2 కిలోల ఖోవా స్వీట్లు మరియు 12 కిలోల సోన్ పాప్డీని స్వాధీనం చేసుకున్నారు.

